

సత్యదేవునికి వజ్రాల హారం బహూకరణ


ఇఒకు హారాన్ని అందజేస్తున్న దాతలు

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం సత్యనారాయణ స్వామికి పెద్దాపురంకు చెందిన లలిత బ్రాండ్ రైస్ అధినేత, దేవస్థానం మాజీ పాలకమండలి సభ్యుడు మట్టే సత్య ప్రసాద్ వజ్రాల హారంతోకూడిన ఆభరణాన్ని బహుకరించారు. ఆదివారం ఆయన కుటుంబ సమేతంగా కొండపైకి వచ్చిన ఆయనకు ఇఒ వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం రూ19 లక్షలు వ్యయం గల 122 గ్రాముల బంగారం, వజ్రాలతో కూడిన వజ్రాభరణాన్ని ఇఒకు అందజేశారు.

ఉపాధి కరువు..!


- కష్టంగా కుటుంబ పోషణ
- అవకాశాలు లేక నిరాశలో నిరుద్యోగులు
- ఉద్యోగాల కోసం ఎదురు చూపులు
- నిరుద్యోగ భృతి ఊసెత్తని కూటమి సర్కారు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులు అల్లాడుతున్నారు. గ్రాడ్యుయేషన్ ఆపై చదువులు కూడా పూర్తి చేసినప్పటికీ అనేకమంది ఉద్యోగాల వేటలో తిరుగుతున్నా తగిన అవకాశాలు దక్కడం లేదు. ప్రభుత్వం ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఓ పక్క ఉపాధి లేక మరోవైపు కుటుంబాలను పోషించుకోలేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తాము అధికారంలోకి వస్తే 20 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, లేకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి పార్టీల నేతలు ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. తీరా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలంలో డిఎస్‌సి పోస్టుల పరీక్షల నిర్వహణ తప్ప ఇతర హామీలను ఏవీ పట్టించుకున్న పాపాన పోలేదు.

పెరుగుతున్న నిరుద్యోగం

జిల్లాలో నిరుద్యోగుల సంఖ్య ఎప్పటికప్పుడు పెరుగుతుంది. జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా ప్రభుత్వ నియామకాలు చేపట్టడం లేదు. దీంతో వాటిల్లో నమోదైన వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఇలా ఉమ్మడి జిల్లాలో ఏటా 40 వేల మందికి పైగా నిరుద్యోగులు తయారవుతున్నారు. గత 12 ఏళ్ళలో దాదాపు 5 లక్షల మంది నిరుద్యోగులు తయారయ్యారనేది ఒక అంచనా. దేశంలో అధికారం చేపట్టి పదేళ్ల అయినప్పటికీ మోడీ ఒక కొత్త ఉద్యోగం కూడా ఇవ్వలేకపోయారు. స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా నినాదాలు గాలిలోనే ఉన్నాయి. దేశాన్ని ముందుకు నడిపించాల్సిన యువత ఉపాధి లేక నిరాశ నిస్పృహలతో కాలం గడుపుతున్నారు. రాష్ట్రంలోని ఇదే పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో సచివాలయ ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేశారు. 2024 ఎన్నికల సమయంలో అధికారంలోకి రావడం కోసం టిడిపి, జనసేన అధినేతలు అనేక హామీలను ఇచ్చారు. నిరుద్యోగాన్ని పారద్రోలి యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వాగ్ధానం చేశారు. తీరా చూస్తే ఇచ్చిన హామీలపై మాట తప్పుతున్నారు. ఉన్న ఉద్యోగాలను పీకి అనేకమంది కుటుంబాలను వీధిన పడేసాయనే ఆరోపణలు కూటమి ప్రభుత్వం ఎదుర్కొంటుంది. అటు ప్రయివేట్ రంగంలోనూ ఉపాధి అవకాశాలు నామమాత్రంగానే దక్కుతున్నాయి. దీంతో అనేకమంది విధిలేని పరిస్థితుల్లో హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబై వంటి సుదూర ప్రాంతాలకు వలసలు పోవాల్సిన దుస్థితి ఏర్పడింది.



ఎదురు చూపులు

ప్రభుత్వ ఉద్యోగాన్ని ఎలాగైనా సాధించాలన్న పట్టుదలతో గ్రాడ్యుయేషన్ పూర్తయిన వెంటనే అనేకమంది పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి పలు సెంటర్లలో కోచింగ్ తీసుకుంటున్నారు. గత ప్రభుత్వం ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి మాట తప్పింది. దాంతో గడచిన సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌కు బుద్ధి చెప్పిన నిరుద్యోగులు కూటమి ప్రభుత్వానికి మద్దతు పలికారు. కూటమి పాలకులపై ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ సంవత్సరం కాలం గడిచినా సరే ఉద్యోగాల మాట ఎత్తడం లేదని పలువురు నిరుద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాకా మెగా డిఎస్‌సిపై తొలి సంతకం చేసి ఏడాది తర్వాత అదిగో ఇదిగో అంటూ అరకొర పోస్టులను మాత్రమే భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. అది కూడా అనేక అవరోధాల తర్వాత ఇటీవలే ఈ పోస్టులకు పరీక్షలు జరిపారు. ఉద్యోగాలను భర్తీ చేస్తామనే మాట అటు నుంచి కొంతమంది ఉద్యోగులను తొలగించడంతో పాలకులు తీవ్ర విమర్శలకు గురయ్యారు. ఏడాది పాలనలోనే ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వని తీరుపై సర్వాత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం ఇంకా నాలుగేళ్లు అధికారంలో ఉంటుంది కాబట్టి నిరుద్యోగుల ఆశలను గట్టెక్కించాలని కోరుతున్నారు.

పెరుగుతున్న నిరుద్యోగం

ప్రభుత్వాలు మారుతున్నా విధానాల అమల్లో పరిస్థితులు మారకపోవడంతో నానాటికీ నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోతుంది. పాలకుల నిర్లక్ష్యం నిరుద్యోగులకు శాపంగా పరిణమించింది. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవడంతో ప్రతి ఇంట్లో ఒక రిద్దరు ఖాళీగా తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. అటు పని చేయలేక, ఇటు ఉద్యోగం రాక తల్లిదండ్రులకు భారమయ్యే దుస్థితి ఏర్పడిందని పలువురు నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగావకాశాలు కల్పించాలి



వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీల ప్రకారం ఏటా భారీగా ఉద్యోగాలను భర్తీ చేయాల్సి ఉంది. ఉపాధి అవకాశాలు కల్పించని పక్షంలో నిరుద్యోగ భృతిగా రూ.3 వేలు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఏడాది కాలంలో ఒక్క నిరుద్యోగికి రూపాయి విదల్చలేదు. రాబోయే రోజుల్లో ఏయే ఉద్యోగాలు ఇస్తామనేది వెంటనే ప్రకటించాలి. అలాగే నిరుద్యోగ భృతిని తక్షణమే విడుదల చేయాలి.

- ఇళ్ల వెంకటేశ్వరరావు, మాజీ ఎంఎల్‌సి


కాకినాడ రూరల్‌లో ఆటో ప్రచార ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర కార్మిక సంఘాల నాయకులు

సమ్మె విజయవంతం కోసం ఆటో ప్రచారం

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ రూరల్ ఈ నెల 9వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు ఆదివారం ఆటో ప్రచారాన్ని ప్రారంభించాయి. ఆదివారం ఇంద్రపాలెం లాకులు, అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభం అయిన ఆటో ప్రచార రథాన్ని సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషాబాబ్జి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సమ్మె ఏర్పాట్లు ఉధృతంగా సాగుతున్నాయని, కాకినాడ జిల్లాలో సుమారు 50 వేల మంది కార్మికులు సమ్మెకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రాక్ సిరామిక్స్, పట్టాభి రైస్ మిల్స్, ఇతర పరిశ్రమల్లో స్థానికులను ఉద్యోగాల నుంచి తొలగిస్తుంటే జిల్లా అధికారి యంత్రాంగం చేష్టలుడిగి చూస్తుందని విమర్శించారు. తక్షణం కాకినాడ పరిసర పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాకినాడ పోర్టు దిగుమతి, ఎగుమతి ట్రాన్స్‌పోర్ట్ స్థానిక లారీలకే ఇవ్వడం ద్వారా లోకల్ డ్రైవర్లకు ఉపాధికల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాకినాడ జిల్లాలో సుమారు 5 లక్షల మంది అసంఘటితరంగ కార్మికులు, చిన్న సన్నకారు రైతుల కొనుగోళ్లతోనే వ్యాపారాలు సాగుతున్నాయని, వీరి ఆర్థిక, సామాజిక ప్రయోజనాలకై జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు వ్యాపార సంఘాలు రాజకీయాలకు అతీతంగా మద్దతు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. బ్యాంకులు, ఇన్సూరెన్స్, పోస్టల్, పోర్ట్, ప్రభుత్వ ఉద్యోగులైన మధ్యతరగతి ప్రజలు సమ్మెలో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజకుమార్, జిల్లా కోశాధికారి మలకా రమణ, ఉపాధ్యక్షులు కె.సత్తిరాజు, జిల్లా కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ, ఆశా వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు అంకాడి పద్మావతి, చెక్కల వేణి, మలకా నాగలక్ష్మి, వెంకటలక్ష్మి, హరినాథ్, మెస్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఏచూరి శ్రీను, రాజశేఖర్, సూర్యనారాయణ, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఐఎన్‌టియుసి ఎపి అండ్ తెలంగాణ ఆర్గనైజింగ్ సెక్రటరీ తాళ్లూరి రాజు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో దాడి బేబీ అధ్యక్షతన ఐసిడిఎస్ ప్రాజెక్టు యూనియన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడారు. ఈనెల 9న జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో అంగన్‌వాడీలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు యూనియన్ కార్యదర్శి ఎస్తేరు రాణి, కోశాధికారి నాగమణి, పాపయమ్మ, టి ఎల్ పద్మావతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పెద్దాపురం సమావేశంలో మాట్లాడుతున్న ఎస్తేరురాణి

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

ప్రజాశక్తి - జగ్గంపేట

ప్రజా సమస్యల పరిష్కారినికే ప్రజా దర్బార్ నిర్వహించడం జరుగుతుందని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. ఆదివారం స్థానిక నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పోతుల మోహనరావు, పోట్రూ కృష్ణ, పోట్రూ రాముడు, మీసాల సత్తిబాబు పాల్గొన్నారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ

రాష్ట్రస్థాయి బాక్సింగ్‌కు పలువురి ఎంపిక

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక ఆర్ఆర్‌బిహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చిన పలువురు రాష్ట్రస్థాయికి ఎంపిక య్యారు. ఆదివారం జిల్లా బాక్సింగ్ అసోషియేషన్ అద్వరంలో జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలను న్యాయవాది సిహెచ్.శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ పోటీలకు జిల్లా నలమూలాల నుంచి 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో ఐదుగురు బాక్సర్స్ సబ్ జూనియర్ బాలురు 37 కేజీల విభాగంలో డివిఎస్ పవన్‌కుమార్ (కొమరగిరి), 43 కేజీలో కెకె.వీరారెడ్డి(కాకినాడ), 46 కేజీలో బోను జయదీప్ (పిఠాపురం), 70 కేజీలో సిహెచ్.లోహిత్(పిఠాపురం), బాలికల విభాగంలో 40 కేజీ షేక్ హమీద(పిఠాపురం) స్వర్ణ పతాకాలు సాధించి రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో జిల్లా నుంచి వారు పాల్గొంటారని జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.లక్ష్మణరావు తెలిపారు. జూనియర్స్ ఓపెన్ విభాగంలో జె.గౌతమ్ (కొమరగిరి), పి.తేజ(పిఠాపురం), జెఆర్.అరుణ్ (పిఠాపురం) స్వర్ణ పతాకలు సాధించారు. జెఆర్.ఆదిత్య రజిత పతాకం సాధించాడు. సబ్ జూనియర్ బాల బాలికలు మాత్రమే రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని, జూనియర్స్ ఓపెన్ విభాగంలో జిల్లా స్థాయికి మాత్రమే పోటీలు నిర్వహించడం జరిగిందని లక్ష్మణరావు తెలిపారు. అనంతరం క్రీడాకారులకు పతాకాలు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా జి.శివప్రసాద్, పి.కృష్ణపవన్ వ్యవహరించారు.


ఎంపికైన విద్యార్థులతో కోచ్‌లు

శాస్త్రీయ దృక్పథం పెంపుదలకు కృషి: జెవివి

ప్రజాశక్తి - పిఠాపురం

ప్రస్తుత తరుణంలో శాస్త్రీయ దృక్పథాన్ని మరింతగా పెంపుదల చేసేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని జెవివి రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు, జిల్లా చెకుముకి కన్వీనర్ వర్మ అన్నారు. ఆదివారం స్థానిక లైన్స్ క్లబ్ కల్యాణ మండపంలో జన విజ్ఞాన వేదిక మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకపక్క శాస్త్ర, సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందుతుంటే, మరోపక్క మూఢనమ్మకాలు ప్రభావానికి ప్రజలు గురువ్వుతున్నారన్నారు. జెవివిగా మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు వివిధ రూపాల్లో కృషి చేస్తున్నామని అన్నారు. రానున్న రోజుల్లో ఆ కృషిని మరింతగా పెంచాలన్నారు. విద్యార్థులను శాస్త్రీయ దృక్పథం వైపు నడిపివారిలో ఆ దృక్పథాన్ని పెంచేలా చేయాలన్నారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా టి.సూరిబాబు, ఎంవివి.ఉదయ్‌కిరణ్, కార్యదర్శిగా ఎజి.మణికంఠ, ట్రెజరర్‌గా ఎంవిఎస్ఎస్.శర్మ, కార్యవర్గ సభ్యులుగా వి.సూర్యనారాయణ, బివివి.సుబ్రహ్మణ్యం, ఎస్.సూర్యనారాయణ, చెకుముకి కన్వీనర్‌గా పోలేశ్వరరావు, కో కన్వీనర్‌గా స్టాలిన్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా మద్యపాన వ్యతిరేక ప్రచార సమితి కన్వీనర్ ఎన్.సూర్యనారాయణ, వై.నానిబాబు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జెవివి రాష్ట్ర నాయకులు వర్మ

కూటమి ఏడాది పాలన ప్రజారంజకం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్


కూటమి ఏడాది పాలన ప్రజారంజకంగా జరిగిందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మండలంలోని ఇంద్రపాలెం పల్లపు వీధి, రామాలయం, మెరక వీధి, కొత్తూరులో గ్రామాల్లో జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి సుభాష్ ఇంటింటికి వెళ్లి ఏడాది కూటమి పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. అలాగే ప్రజాభిప్రాయాలు సేకరించి మై టిడిపి యాప్ లో పొందుపరిచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఏడాది కాలంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసిందని తెలిపారు. పతిపక్ష హోదా లేని పార్టీలు రాష్ట్రంపై విష ప్రచారం చేస్తూ, కుల, మతాల పేరిట రెచ్చగొడుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, రూరల్ టిడిపి కోఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు, పార్టీ నాయకులు పెంకే శ్రీనివాసబాబా, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు ఎం.గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాన్ని అందజేస్తున్న మంత్రి సుభాష్


వృథాగా పోతున్న తాగునీరు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక నువ్వులగుంట వీధిలో మంచినీటి సరఫరా జరిగే పైపులైన్ కొన్ని నెలల క్రితం పగిలి మంచినీరు వృథాగా పోతుంది. దీంతో ఆ ప్రాంతాల ప్రజల ఇంటి కుళాయిల ద్వారా సక్రమంగా నీరు రాకపోవడంతో సైకిల్ ట్యూబ్‌లుతో పగిలిన పైపు వద్ద చుట్టారు. అయినప్పటికీ నీటి వృథా తప్పడం లేదు. ఆరు నెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవటం లేదని సిపిఎం నాయకులు కూనిరెడ్డి అప్పన్న అన్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు ఈ పగిలిన పైపులైన్‌కు మరమ్మతులు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.


పైపులైన్ నుంచి వృథాగా పోతున్న తాగునీరు

కార్టూ'నిజం'



క్లినికల్ ల్యాబ్ ఏర్పాటుకు కృషి

ప్రజాశక్తి - సామర్లకోట

అతి తక్కువ ధరలతో ఆరోగ్య పరీక్షలు నిర్వహించేలా క్లినికల్ ల్యాబ్‌ను సామర్లకోటలో ఈ ఏడాది ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని లైన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఈదల ఈశ్వర్‌కుమార్ వెల్లడించారు. ఆదివారం స్థానిక లైన్స్ క్లబ్ భవనంలో శ్రీ భీమేశ్వర లయన్స్ క్లబ్ 25వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్లబ్బు భవనంపై నిర్మించిన ఎసి హాలును టిడిపి యువ నాయకుడు నిమ్మకాయల రంగనాగ్ ప్రారంభించారు. అనంతరం లైన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షులు చిత్తలూరి వీర్రాజు రాజా అధ్యక్షతన నిర్వహించిన సభలో గవర్నర్ ఈశ్వర్‌కుమార్ మాట్లాడుతూ 25 ఏళ్ళుగా పట్టణ ప్రజలకు లైన్స్ క్లబ్ అందిస్తున్న సేవలను వివరించారు. రానున్న రోజుల్లో లైన్స్ క్లబ్ సహకారంతో సామర్లకోటలో తక్కువ ధరలకు పరీక్షలు అందుబాటులోకి వచ్చేలా క్లినికల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా గత 25 సంవత్సరాలుగా క్లబ్ అధ్యక్షులుగా వ్యవహరించిన వారిని, దాతలను, క్లబ్ సీనియర్ నాయకులను టిడిపి యువ నాయకుడు నిమ్మకాయల రంగనాగ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షులు అమలకంటి శ్రీనివాసరావు, కార్యదర్శి బడుగు బాబి, కోశాధికారి ఏలేటి రమేష్, టిడిపి నాయకులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, కంటే బాబు, యార్లగడ్డ చిన్ని, బలుసు వాసు, తదితరులు పాల్గొన్నారు.


క్లబ్ గత అధ్యక్షులను సత్కరిస్తున్న నిమ్మకాయల రంగనాగ్, ఇతరులు


హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

హెల్మెట్ వినియోగం తప్పనిసరి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ద్విచక్ర వాహనాలు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సిఐ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఉప్పాడ- కాకినాడ బీచ్ రోడ్లో ద్విచక్ర వాహనాలపై పోలీసులు హెల్మెట్ ధరించి అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాలకు గురైన ప్రాణాలను కాపాడుకోవచ్చని అన్నారు. ప్రమాదం జరిగితే వారిపై ఆధారపడిన కుటుంబాలు జీవితకాలం నష్టపోతాయని, అందుకే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రమాదాలకు గురకాకుండా కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



మాజీ సిఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా ఈనెల 8న స్థానిక లయన్స్ క్లబ్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ముద్రగడ గిరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గవ్యాప్తంగా రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి, సేవా కార్యక్రమాలను నిర్వహించాలని వైసిపి శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. కష్టాల్లో ఉన్న రోగులను ఆదుకోవడానికి నిర్వహిస్తున్న రక్తదాన శిబిరంలో రక్తదానం చేసేందుకు యువకులు ముందుకు రావాలని సూచించారు.

మానవ మనుగడకు మొక్కలే శరణ్యం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

భవిష్యత్ తరాల మనుగడకు మొక్కలే శరణ్యం అని ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు, ప్రముఖ వైద్యులు డాక్టర్ సఖిరెడ్డి విజయబాబు అన్నారు. ఆదివారం సంఘం ఆధ్వర్యంలో స్థానిక షిరిడి నగర్ రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిపోతున్న వాయు, జల, ఉపరితల కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం అలవాటుగా చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ నాగేశ్వరరావు, కార్యదర్శి గోళ్ళ నాగేశ్వరరావు, డివివి.సత్యనారాయణ, తిరగటి సత్యనారాయణ, ఏళ్ల చక్రధర్‌రావు, రౌతు సహదేవుడు, బంక రాజు, సిరి ఫుడ్స్ కృష్ణ, గుర్రం లోవరాజు, పి శివరామకృష్ణ పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న విజయబాబు

గొల్లప్రోలులో నేడు వైసిపి సమావేశం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

స్థానిక సత్య కృష్ణ కల్యాణ మండపంలో సోమవారం పిఠాపురం నియోజకవర్గ వైసిపి సమావేశం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వంగా గీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం అయ్యే ఈ సమావేశంలో వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్, మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశానికి నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక సబ్ స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు పనుల కారణంగా సోమవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎవిఎన్‌డివిఎస్.ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపేట, చిన్నవీధి, కోటపేట, ఉప్పువారి వీధి, పాత రెవెన్యూ కార్యాలయం, బలుసులపేట, సంగీతరావుపేట, వీరరాఘవపురం, నీలమ్మ చెరువు, ఇందిరా కాలనీ, పెన్షన్ లైన్, అలాగే విగ్నేశ్వర థియేటర్, మటం సెంటర్, కొత్తూరు, నిమ్మతోట, తాండ్రపాపారాయుడు వీధి, గణపతినగర్, బల్లమార్కెట్, గాంధీ బొమ్మ సెంటర్, బ్రౌన్‌పేట, గణేష్ కాలనీ, సీతారామరాజు కాలనీ, యానదుల కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పదవులకే వన్నెతెచ్చిన కొండయ్య దొర

ప్రజాశక్తి - గండేపల్లి

టిడిపి సీనియర్ నాయకుడు, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, గృహ నిర్మాణ శాఖ మాజీ డైరెక్టర్ స్వర్గీయ కందుల కొండయ్య దొర పదవులకు వన్నె తెచ్చారని పలువురు కొనియాడారు. ఆదివారం మండలంలోని మురారి గ్రామంలో టిడిపి యువ నాయకుడు జాస్తి వసంత్ ఆధ్వర్యంలో కొండయ్య దొర జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి కందుల చిట్టిబాబు, జాస్తి వసంత్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కందుల కొండయ్యదొర ఏ పదవిని చేపట్టినా ఆ పదవికే వన్నెతెచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కోర్పు సాయితేజ, కందుల విజయ్, కందుల వినయ్, కందుల కొండయ్య చౌదరి, కందుల గోవిందచౌదరి, కంటే సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.


కొండయ్యదొరకు నివాళులర్పిస్తున్న టిడిపినేతలు

నేరాలు ఘోరాలు

పేకాడుతున్న పదిమంది అరెస్టు

ప్రజాశక్తి - తాళ్లపూడి

తమకు అందిన సమాచారం మేరకు మండలంలోని గజ్జరం గ్రామంలో పదిమంది పేకాటరాయుళ్లను అరెస్టు చేయడం జరిగిందని తాళ్లపూడి ఎస్సై టి రామకష్ణ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.12,340 నగదు, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. ఎస్సై వెంట పోలీస్ సిబ్బంది కూడా ఉన్నారు.

గొల్లప్రోలులో...

పట్టణ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.22,590 నగదును స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

విద్యుదాఘాతంతో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - కాజులూరు

మండలంలోని కోలంక నామావారి వీధిలో విద్యుదాఘాతంతో ఒక తాటాకు ఇల్లు దగ్ధం అయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..కోలంక నామావారి వీధిలో నివాసం ఉంటున్న కొడగాల వెంకటేశ్వర్లుకు చెందిన తాటాకు ఇంటికి ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి.దీంతో స్థానికులు కాకినాడ అగ్నిమాపక శాఖకు ఫోన్ ద్వారా తెలియచేశారు. అగ్నిమాపక శకటం వచ్చే సమయానికి ఇల్లు పూర్తిగా దగ్ధం అయింది. ఫైర్ సిబ్బంది చుట్టుపక్కలకు మంటలు వ్యాప్తి చెందకుండా కట్టడి చేశారు. ఈ తాటాకు ఇంటిలో వెంకటేశ్వర్లు, చిన్న కుమారుడు వీరబాబు నివాసం ఉంటున్నారు. ఇంటిలో గల సామాగ్రి పూర్తిగా తగలబడడంతో ఆ కుటుంబాలు కట్టుబట్టలతో ముగిలారు. ఈ ప్రమాదంలో నష్టం రూ.2 లక్షల వరకు ఉంటుందని అంచనా వేసినట్లు జిల్లా సహాయ ఫైర్ అధికారి బి.ఏసుబాబు తెలిపారు.

పశు మాంసం తరలిస్తున్న వారిపై కేసు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చెందుర్తి గ్రామం నుంచి అక్రమంగా తరలిస్తున్న పశు మాంసాన్ని ఆదివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెందుర్తి గ్రామ శివారులో గోవధ జరుగుతుందన్న సమాచారంతో ఎస్ఐ ఎన్.రామకృష్ణ, విఆర్ఒ ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ఒక ట్రక్ లో సుమారు 1000 కేజీల పసుమాంసంను స్వాధీనం చేసుకున్నారు. ఒక ట్రక్ ఆటో, నాలుగు మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని, నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితులకు రిమాండ్


ప్రజాశక్తి - గొల్లప్రోలు

శుక్రవారం పట్టణంలో బైపాస్‌లోని దాబా వద్ద జరిగిన హత్యాయత్నం కేసు నిందితులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పట్టణానికి చెంది న జ్యోతుల రాంబాబు, ఊట దుర్గాప్రసాద్‌లను శని వారం రాత్రి స్థానిక టోల్ ప్లాజా వద్ద ఎస్ఐ రామకృష్ణ అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

33 కెవి వైర్లపై పడిన కోతి విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రామవరం పుష్కర పంపు హౌస్ పవర్ స్టేషన్ వద్ద 33 కెవి వైర్లపై కోతి పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో సబ్ స్టేషన్ పరిధిలోని సుమారు 10 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రి 9 గంటల వరకూ విద్యుత్ రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. దీనిపై విద్యుత్ శాఖ ఎఇ పి.మాధురి వివరణ ఇస్తూ 220 కెవి బ్రేకర్ పాడవడంతో అంతరాయం ఏర్పడిందని, పెద్దాపురం నుంచి విద్యుత్‌ను సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి

ప్రజాశక్తి - తాళ్లరేవు, పెద్దాపురం

తాళ్లరేవు మండలం జార్జిపేట ఎంఎల్‌కె నగర్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి ఆదివారం జరిగింది. తొలుత ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ పెట్ల సూర్యనారాయణ రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శీలి రాజు, మోర్త సతీష్, మోర్త నాగేష్, మందపల్లి నాగార్జున, మందపల్లి నాగేష్, పలివెల మరియదాస్, కూర్మాన అబ్రహం పాల్గొన్నారు. అలాగే పెద్దాపురం పట్టణంలోని కొండయ్యపేటలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మందపల్లి రుద్రయ్య, లంక నాగభూషణం, దొండపాటి సుదర్శనరావు, కోమారపు జయరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రచార వాహనం ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గంపేట

గండేపల్లి క్లస్టర్ ఇన్‌ఛార్జ్, మురారి గ్రామ ఉప సర్పంచ్ జాస్తి వసంత్ తయారు చేయించిన సుపరిపాలన తొలి అడుగు ప్రచార రథాన్ని టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ ప్రారంభించారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ ఏడాది పాలనలో అభివృద్ధి, సంక్షేమాలను ప్రజలకు తెలియజేయాలని సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ అడపా భరత్‌కుమార్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, పోతుల మోహనరావు, కోర్పు సాయితేజ పాల్గొన్నారు.

ఇంటింటికీ సుపరిపాలన తొలి అడుగు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో కూటమి ఏడాది పాలనపై చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఆదివారం కొనసాగింది. పలు ప్రాంతాల్లో ఎంఎల్‌ఎలు పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని ప్రభుత్వ పథకాల అమలుతీరును వివరించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

ఏలేశ్వరం నియోజకవర్గంలో అర్హులైన వారందరికీ పక్కా గృహాలను నిర్మిస్తామని ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. ఆదివారం మండలంలోని రమణయ్యపేట గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలను కలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిం చారు. గ్రామంలో ఉన్న సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ స్తులు తమకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇప్పించాలని కోరారు. దీనిపై ఆమె మాట్లాడుతూ ఇల్లు లేని పేదలకు కూటమి ప్రభుత్వం ఇళ్లను కేటాయిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గొల్లపల్లి బుజ్జి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి విఎస్ఎన్.రాజేష్, జ్యోతుల పెదబాబు, సూతి బూరయ్య, చిక్కాల లక్ష్మణరావు, బస ప్రసాద్, కోరుకొండ నూక రాజు, తదితరులు పాల్గొన్నారు. **గండేపల్లి** మండలంలోని మల్లేపల్లి గ్రామంలో టిడిపి మండల అధ్యక్షులు పోతుల మోహన్‌రావు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అడబాల భాస్కరరావు, ఎస్‌విఎస్.అప్పలరాజు, తెలగ రెడ్డి భద్రరావు, బలిరెడ్డి గంగరాజు, సుంకవల్లి రాజు, దిడ్డి చిన్న శ్రీను, కొల్లి త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు. **సామర్లకోట** మండలంలోని పవర, పండ్రవాడ గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకుడు నిమ్మకాయల రంగనాగ్, టిడిపి నాయకులు పాలకుర్తి శ్రీనుబాబు, ఆకునూరి సత్తిబాబు, తోటకూర శ్రీనివాస్, పెంకె వెంకటేష్, చీకట్ల వెంకటేష్ , అద్దాల వెంకన్నబాబు, నర్ల వెంకటరమణ ,ముమ్మిడి సోమరాజు, పాల్గొన్నారు. **పెద్దాపురం** మండలంలోని చంద్రమాంపల్లి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ నాయకులు ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధికి చెందిన కరపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేలంగి వెంకట్రావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సామర్లకోటలో ఎంఎల్‌ఎ చినరాజప్ప



ఏలేశ్వరంలో ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ



గండేపల్లిలో ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ

ఆరోగ్యకరమైన జీవనం కోసం టీకాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

గొల్లప్రోలు స్థానిక పశువుల ఏరియా ఆసుపత్రి వద్ద ఉచితంగా యాంటీ రాబిస్ టీకా శిబిరాన్ని నిర్వహించారు. సహాయ సంచాలకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెంపుడు కుక్కలకు, పశువులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో తూర్పు డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ సునీల్‌కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు, దుర్గాడ, పశు వైద్యులు టి.శ్రీకాంత్, డి.శ్రీనివాస్, జనసేన నాయకులు కడారి తమ్మయ్యనాయుడు, బస్వా చిట్టిబాబు, గరగ తాతాజీ బలిరెడ్డి గంగబాబు, మొగలి రామ్మూర్తి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. **సామర్లకోట** భీమేశ్వర లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలోఉచిత వ్యాక్సిన్ పంపిణీ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. అలాగే ప్రభుత్వ క్లస్టర్ ఆసుపత్రి ఆవరణలో దాత సత్యవోలు వీరవెంకట సూర్యనారా యణమూర్తి రూ.4 లక్షల వ్యయంతో నిర్మించిన రోగుల వేచి ఉండే ఒపి షెడ్, మంచినీటి ప్లాంట్‌ను చినరాజప్ప ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఈదల ఈశ్వర్‌కుమార్, జిల్లా ఛైర్మన్ చిత్తూలూరి వీర్రాజు, క్లబ్ అధ్యక్షులు అమలకంటి శ్రీనివాసరావు, కార్యదర్శి బడుగు బాబీ, కోశాధికారి ఏలేటి రమేష్, క్లబ్ నాయకులు, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పివి.వరప్రసాద్, పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వి.ప్రమీల, మండల పశువైద్యాధికారి భవానీ, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు. **జగ్గంపేట** ప్రపంచ జోనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కుక్కలకు వ్యాక్సిన్లు వేశారు. పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు కె.తాతయ్య ఆధ్వర్యంలో సిబ్బంది కుక్కలకు ర్యాబిస్ వ్యాధి నిరోధికానికి టీకాలు వేశారు.



సామర్లకోటలో ఎంఎల్‌ఎ చినరాజప్ప



గొల్లప్రోలులో టీకా వేస్తున్న వైద్యులు

మరిడమ్మ జాతరకు పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ అమ్మవారి జాతరకు ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు తరలి వచ్చారు. యాత్రికులకు ఎటువం టి ఇబ్బందులు లేకుండా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ లక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు. క్యూలైన్లో ఉన్న వారికి మంచి నీరు, వారి పిల్లలకు వేడి పాలు అందజేశారు. ట్రాఫిక్‌కు అంత రాయం ఏర్పడకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.ఆదినారాయణ ఆధ్వర్యంలో ఆలయ పరిసరాలలో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించారు. యాత్రి కులకు పలు స్వచ్ఛంధ సంస్థలు పులిహార, దద్ధోజనం, పిల్లలకు పాలు పంపిణీ చేశారు.



సందడిగా మరిడమ్మ ఆలయం

రంపచోడవరం టిడిపి పరిశీలకునిగా శ్రీనివాస్

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

టిడిపి బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కెఎల్‌బి ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ ఛైర్మన్ కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్ రంపచోడవరం నియోజకవర్గ టిడిపి పరిశీలకులుగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం ఆదివారం ఉత్తర్వులు విడుదల చేసిందని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ అధిష్టానం నియోజకవర్గాల పరిశీలకును నియమించిందని తెలిపారు. ఇందులోభాగంగా తనను రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకులుగా నియమిం చడం సంతోషకంగా ఉందన్నారు. ఈపదవి తన బాధ్యతలను మరింతగా పెంచిందన్నారు. ఎంఎల్‌ఎ మిరియాల శిరీషాదేవి ఆధ్వర్యంలో రంపచోడవరం నియోజకవర్గంలో తన విధులను సక్రమంగా నిర్వహిస్తానని తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



ఉత్సాహంగా ఈత పోటీలు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

జిల్లా క్రీడా మైదానంలో 10వ సబ్ జూనియర్, జూనియర్ అంతర్ జిల్లా ఈత పోటీలు ఆదివారం జరిగాయి. ఈ పోటీలకు సుమారు 150 మంది క్రీడాకారులు వివిధ కేటగిరీలలో పాల్గొన్నారు. జిల్లా అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో జాతీయ మార్తాన్ స్విమ్మర్ గోలి శ్యామల పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే మంచి నడవడికను నేర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు. ఈ పోటీల్లో గ్రూప్ వన్ బాయ్స్ విభాగం నుంచి కె.వీరశివకృష్ణ, ఎం.గోకుల కన్నా, కె.ముత్యాలముఖేష్, వి.మణికంఠనవీన్, టి.దుర్గేష్, గ్రూప్ వన్ గర్ల్స్ విభాగంలో పి.సహస్రశ్రీ, గ్రూప్ టు బాయ్స్ విభాగంలో, టివిసి.సాయిసాకేత్, పి.కౌశిక్‌వర్ధన్, ఎస్.మిచిల్‌అర్జున్, ఎ.అభిసాయి, వై.గౌతమ్, ఎ.అక్షిత్, వీరాజ్‌విజయ్ కాలే, వెనిస్టెంట్ చార్లెస్ స్టీఫెన్, గ్రూప్ టూ గర్ల్స్ విభాగంలో సిహెచ్.హిమజ్యోతి, కె.తనుశ్రీ, గ్రూప్ త్రీ బాయ్స్ విభాగంలో కె.దర్శిల్, ఎస్.క్రితిక్, ఎం.షణ్ముఖ్వీర్, ఎం.సాయిచరణ్, జి.భువనేష్, జి.రోబిన్, గ్రూప్ త్రీ గర్ల్స్ విభాగంలో ఎస్.గుల్బర్, జి.అన్విధ, ఎం.పల్లవి, ఎం.ఆశ్విని ఎంపికయ్యారు. వీరంతా ఈనెల 19, 20 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే 10వ సబ్ జూనియర్, జూనియర్ అంతర జిల్లాల ఈతల పోటీలో పాల్గొంటారు. సిమ్మింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్దిరెడ్డి సతీష్, కార్యదర్శి ఇరుసుమల్ల రాజు, ముఖ్య సలహాదారుడు మంగా వెంకటశివరామకృష్ణ ఆధ్వర్యంలో ఎంపికలు జరిగాయి. ఈ కార్యక్రమంలో చీఫ్ కోచ్ డి.శ్రీనివాస్, కోచ్‌లు ఎం.అజయ్‌కుమార్, పి.ఎ.నాయుడు, వి.వీరభద్రయ్య, ఎల్.రాకేష్, జి.మురళీకృష్ణ పాల్గొన్నారు.



స్విమ్మింగ్ పోటీల్లో క్రీడాకారులు

యాజమాన్యం హామీతో ఆందోళన విరమణ

ప్రజాశక్తి - సామర్లకోట

రాక్ సిరామిక్స్ పరిశ్రమలో 90 మంది కార్మికులకు ఈనెల 10వ తేదీ నుంచి వేరే సెక్షన్‌లో పని కల్పిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు శనివారం రాత్రి పదిన్నర గంటలకు ఆందోళన విరమించారు. శనివారం ఉదయం ప్యాక్టరీ యాజమాన్యం 90 మంది కార్మికులను తొలగిస్తున్నట్లు ప్రకటించడంతో కార్మికులు ఫ్యాక్టరీ లోపల వర్క్ షెడ్‌లో ప్రత్యక్ష ఆందోళనకు దిగారు. తమను ఉద్యోగాల నుంచి తొలగించమని స్పష్టమైన హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తామని కార్మికులు స్పష్టం చేశారు. దీంతో హెచ్‌ఆర్ ప్రతినిధులు సోమ, మంగళ, బుధవారం సెలవుల అనంతరం విధులకు హాజరు కావాలని, వేరే సెక్షన్‌లో 90 మంది కార్మికులకు పని కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు శనివారం రాత్రి 10.30 గంటల సమయంలో ఆందోళన విరమించారు. అయితే హెచ్‌ఆర్ ప్రతినిధులు ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటారా? లేదా? అనేది గురువారం తెలియనుంది.

రక్తదానం ద్వారా ప్రాణదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఆరోగ్యవంతమైన యువత రక్తదానం ద్వారా అనేకమంది ప్రాణాలు కాపాడవచ్చని ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక దర్గాపేటలో బాధ్యత ట్రస్ట్ ఆధ్వర్యంలో 'మన ఇల్లు' సంస్థ 5వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంఎల్‌ఎ చినరాజప్ప జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలకు భారిన పడిన వారికి అవసరమైన సమయంలో రక్తం అందుబాటులో లేక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు 'మన ఇల్లు' సంస్థ పేదలకు అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మన ఇల్లు వ్యవస్థాపకుడు ఎవివి.సత్యనారాయణ, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కొరుపూరి రాజు, టిడిపి పట్టణ కార్యదర్శి తూతిక రాజు, డిఎస్‌పి డి.శ్రీహరిరాజు, ఎస్ఐ వి.మౌనిక, రోటరీ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎంఎల్‌ఎ చినరాజప్ప

జెఎన్‌టియుకెలో అధికారుల నియామకం

ప్రజాశక్తి - కాకినాడ

పరిపాలనా సంస్కరణల్లో భాగంగా ఉపకులపతి ప్రొ. సిఎస్‌ఆర్‌కె.ప్రసాద్ ఆదేశాలతో జెఎన్‌టియుకె పలువురు అధికారులు నియమితులయ్యారు. యుసిఇకె ఇఇఇ విభాగం ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రొ. ఆర్.శ్రీనివాసరావును ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తించిన ప్రొ.వి.రవీంద్రనాథ్‌ను ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు. అదేవిధంగా జెఎన్‌టియుకె యుసిఇకె మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రొ.వివి.సుబ్బారావును ఇన్‌ఛార్జ్ రెక్టార్‌గా నియమించారు. ఇప్పటివరకు రెక్టార్‌గా విధులు నిర్వర్తించిన ప్రొ.కెవి.రమణను ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు. ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్‌గా నియమితులైన ప్రొ. ఆర్.శ్రీనివాసరావును, ఇన్‌ఛార్జ్ రెక్టార్‌గా నియమితులైన ప్రొ.వివి.సుబ్బారావును ఉపకులపతి ప్రొ.సిఎస్‌ఆర్‌కె.ప్రసాద్, ఒఎస్ ప్రొ.డి.కోటేశ్వరరావు, డైరెక్టర్లు, యూనివర్శిటీ అధికారులు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది అభినందించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మండలంలోని రమణయ్యపేట పంచాయతీ పరిధిలోని దండు పుంతలో దృష్టి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం షారోన్ ప్రేయర్ హాల్ పాస్టర్ జాషువా గిరి, షారోన్ నేతృత్వంలో జరిగింది. ఈ సందర్భంగా పాస్టర్ జాషువా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కంటి చూపు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని కంటి పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాయుడు అనిల్, యాదగిరి సత్యనారాయణ, జనసేన నాయకులు కుడిపూడి బాలాజీ, వైసిపి నాయకులు నల్లి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

మణికర్ణిక బృందం రక్తదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక మణికర్ణిక బృందం హైదరాబాద్ చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. ఆదివారం మేడిది సుబ్బయ్య ట్రస్టు ఆధ్వర్యంలో మెగా బ్లడ్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ శిబిరంలో తమ బృందం నుంచి 13 మంది రక్తదానం చేసినట్లు మణికర్ణిక యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు గున్నాబత్తుల అనూష స్థానిక విలేకరులకు తెలిపారు. అనంతరం మేడిద సుబ్బయ్య ట్రస్ట్ ఛైర్మన్ జ్ఞాపికను ఇచ్చి సత్కరించారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బృందం సభ్యులు శ్రీనివాస్, చిక్కాల మణికంఠ, వీరబాబు, స్వామి, వంశీ, అనిల్, ప్రసాద్, మణి, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్ కుటుంబ సభ్యులకు డాక్టర్ ఓబుల్ రెడ్డి హెల్త్ కేర్ హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రెస్‌క్లబ్‌లోని సభ్యులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇసిజి, 2డి ఎకో, స్కానింగ్, వివిధ రకాల రక్త పరీక్షలు, బిపి, షుగరు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. ఈ శిబిరంలో గుండె వైద్య నిపుణులు డాక్టర్ జి.ఓబుల్‌రెడ్డి, జనరల్ సర్జన్ డాక్టర్ మల్లిడి భార్గవి వైద్య సేవలు అందించారు. జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా వైద్య సేవలు అందించిన ఓబుల్ రెడ్డి హెల్త్ కేర్ ఆసుపత్రి యాజమాన్యానికి జర్నలిస్టులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రెడ్డిపల్లి రాజేష్, కార్యదర్శి మోహన్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

యానాం వార్తలు



ఎర్రబారిన గౌతమీ గోదావరి నది

ఎర్రబారిన గౌతమీ గోదావరి

ప్రజాశక్తి - యానాం

శనివారం వరకూ నీలి రంగు జలాలతో కనువిందు చేసిన గోదావరి నది ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో ఆదివారం ఒక్కసారిగా ఎర్రబారింది. గోదావరికి ఏటా జూన్ నెలలో వరద రావడం నీరు అరుణవర్ణం దాల్చడం ఆనవాయితీ. వరద నీటితో కొత్తందాలను సంతరించుకున్న గోదావరిని చూసేందుకు ఆదివారం రాజీవ్ బీచ్‌కు పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు.



బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతిని ఆదివారం సమాచార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక భీమ్ నగర్, రాజీవ్ బీచ్ రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి మున్సిపల్ కమిషనర్ బుద్ధి అఖిల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐ అడలరసన్, ట్రాఫిక్ ఎస్ఐ నూకరాజు, కొల్లు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలిని మహిళ మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - యానాం

స్థానిక దరియాలతిప్ప ఐస్ ఫ్యాక్టరి సమీపంలో గుర్తుతెలియని మహిళా మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కథనం ప్రకారం.. మహిళా మృతదేహం గోదావరిలో కొట్టుకొచ్చినట్లు తెలిపారు. ఎర్రటి దుస్తులు ధరించి గుర్తు పట్టని స్థితిలో ఉందన్నారు. ఆమెకు 40 నుంచి 50 సంవత్సరాలు మధ్య వయసు ఉంటుందన్నారు. మృతదేహాన్ని జిజిహెచ్ మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఆదిత్యలో ఎన్‌సిసి క్యాంపు విజయవంతం

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగిన ఎన్‌సిసి క్యాంపు విజయవంతంగా ముగిసిందని 18 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ మహమ్మద్ ఆసిఫ్ తెలిపారు. ఈ క్యాంపులో కాకినాడ, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన వివిధ పాఠశాలలు కళాశాలల నుంచి 570 మంది పాల్గొన్నారని తెలిపారు. క్యాంపులో రక్తదానం, సైబర్ సెక్యూరిటీ, డ్రోన్, దేశభక్తి, దేశ రక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఆదిత్య యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.